# వాన వెలిసింది

## గండ్రేటి పెంటయ్య

**శెలవు** రోజులు మినహాయిస్తే మిగతా రోజుల్లో ఉదయం తొమ్మిదిన్నరయ్యేసరికల్లా ఉడికీ ఉడకని మెతుకుల్లో చుర్రుమంటున్న పిక్కచారు పోసుకుని అప్పడమూ, ఆవకాయా అధరవులుగా, కారుతున్న ముక్కును ఎగజీదుకుంటూ, ఓడుతున్న చెమటను ఒత్తుకుంటూ భోజనమయిందనిపించేస్తాడు ఆదినారాయణ. ఆ తరవాత ఆదరాబాదరాగా పరుగులాంటి నడకతో ఆఫీసుని చేరుకుంటాడు. తిరిగి సాయంత్రం అయిదున్నర తరవాతనే తిరోన్ముఖం. జిడ్డు వడిన ముఖంతో లోతుకు పోయిన కళ్ళతో నిస్సత్తువుగా ఇల్లు జేరుతున్న భర్తను లంచవర్లో కొంచెం టిఫిను తింటుండమని ఎన్నిసార్లో అంది. కాని, ఆదినారాయణకు మనస్కొప్పలేదు. అతడు మహా మొగమాటస్థుడు. ఏమన్నా, ఏం చేసినా ఎదుటి వాళ్ళేమనుకుంటారోనన్న భయం. ఆఫీసులో ఏ పని అంటగట్టినా, మొగమాటానికి పోయి గంగిరెద్దులా తలూపేస్తాడు. ఎప్పుడూ ఎలానో ఒహలాగ సర్దుకుపోవడానికే చూస్తాడు. నిజానికి ఇదివరలో కొన్నాళ్ళపాటు లంచ్ టైమ్‌లో కాంటీను కెళ్ళి టిఫిను చేసేవాడు. క్రమంగా అది గిట్టుబాటుగా కనిపించక మానుకున్నాడు. నెలనెలా జీతంలోని మూడోవంతు సొమ్ము కాంటీను బిల్లుకే వెళ్ళిపోతుంటే గొర్రెతోక గుమాస్తా గిరిలో జరుగుబాటు కుంటుపడి అవసరాల తిరుగుబాటు పెరిగిపోతుంటుంది. అతడు కాంటీను కెళ్ళే కొత్తలో మొగమాటంకొద్దీ తనతోపాటు వచ్చిన తన కొలీగులు బిల్లులనుకూడా తన్నఖాతాలోనే రాయించాడు. అదే బాగుందనుకున్న అతని కొలీగులు అప్పట్నుండి కాంటీనుకి అతని వెంటబడ్డం అలవర్చుకున్నారు. మొగమాటంతో బిగుసుకుపోయే ఆదినారాయణ ఎవర్నీ ఏమీ అనలేక కొన్నాళ్ళపాటు ఖర్చంతా భరించుకొచ్చాడు. ఓ రోజు జీతమందుకొని కాంటీను పద్దును పూర్తిగా కొట్టించేసి మిగతా జీతం సొమ్మును భార్య చేతికిచ్చాడు. చేతికి తేలిగ్గా తగిలిన రాళ్ళని లెక్కబెట్టి చూసి, మూడోవంతు మైన స్పెందుకయ్యిందని అడిగింది కమల. భార్య సంజాయిషీ అడిగిందన్న కోపం వల్ల, కాంటీను టిఫిను ఒంటికి పడ్డం లేదన్న నెపంతో మర్నాటినుండి మానుకున్నాడు మధ్యాహ్నం టిఫిను. కొలీగులు ఒకటి రెండు సార్లు బయల్దేరదీశారు. ఆకలితో పంతంగా అలా ఉండిపోయాడే గాని, కాంటీనులో కాలు మోపలేదు.

నిజానికి కొంచెమయినా టిఫిను పడకపోతే గొడ్డుచాకిరీ గుమాస్తా గిరీలో నెగ్గుకు రావడం కష్టమే. కాని, కాంటీనులో కాలు పెడితే కొలీగుల బిల్లులన్నీ తనకే అంటుకుంటున్నాయామె!

రోజూ సాయంత్రం నీరసంగా కొంపకొస్తున్న భర్తను చూసి, కమలకు అర్థమయిపోయింది. అతడు కాంటీను టిఫిను మానుకున్నాడని. రెండ్రోజులు బోధపరిచి చూసింది- రోజూ టిఫిను తింటూ, 'మీ బిల్లొక్కటే మీ రిచ్చుకోండి అని. అతడు మొగమాటాన్ని చంపుకుని వెంట వచ్చిన కొలీగులను కాదనలేడు. అంచేత పూర్తిగా కాంటీను వేపు చూడ్డమే మానుకున్నాడు.

చూసి చూసి ఇకతడు కాంటీను కెళ్ళడం కల్ల అని అనుకుంది కమల. పోనీ ఆఫీసులో కూచోనయినా తింటాడు గదా అని పొద్దున్న ఇంకాస్త ముందుగా లేచి, వంటయిన వెంటనే ఏదో ఒక టిఫిను చేసి పూరీ డబ్బా నింపి చేతికిచ్చి పంపడం ప్రారంభించింది. ఇక అక్కణ్ణుంచి ఆదినారాయణ సెక్షనులోని ఆంజనేయులూ, గుర్నాధమూ, గోవిందరావూ అతడి చేతిలోని టిఫిను డబ్బానూ, అందుండి వస్తున్న ఘుమఘుమ వాసనగా చూసి లంచ్ టైమ్‌లో కాంటీను కెళ్ళడం మానేశారు. అందరి ఎదుటా ఒక్కడూ కూచొని తెచ్చుకున్న టిఫిన్ని తినేయడానికి మళ్ళీ మొహమాట పడిపోయాడు. 'ప్లీజ్ హెల్ప్ మీ' అంటూ సభ్యత కోసం వాళ్ళనీ కంపెనీ ఇవ్వమన్నాడు. అతడలా అనడమే ఆలస్యంగా ఎవరికి దొరికినంత వాళ్ళందుకొని రుచి చూశారు. చేతులు తుడుచుకుంటూ అన్నారంతా "అయ్యా ఆదినారాయణగారూ! పబ్బట్లు అద్భుతంగా ఉన్నాయ్. ఇంత చక్కగా వండి పెట్టే ఇల్లాలున్న మీరు అదృష్టవంతులు." ఆ పొగడ్తలు అతడి కడుపును నింపేశాయా రోజు. ,అక్కణ్ణుంచి రోజూ అదే అలవాటయింది. ఆదినారాయణ అవస్థ తిరిగి యథాస్థితి కొచ్చేసింది. ఒక్కడికని తెచ్చుకున్న టిఫినుపై మరో ముగ్గురొచ్చి పడుతుంటే ఆఖరికి అతడికి మిగుల్తుండేది ఖాళీ డబ్బాయే. డబ్బా నిండా టిఫిను పట్టుకెళ్తున్న భర్త తిరిగి నీరసంగా ఇంటి కొస్తుంటే చూస్తూనే అర్థం చేసుకుంది కమల. తనంత యాతన పడి కడుతున్న టిఫిను అతడి నోట్లో పడ్డం లేదని. మొగుడు చూపెడుతున్న మొగమాటంపై మండుకొచ్చిందామెకు. అది గమనించిన ఆదినారాయణ ఆ మర్నాటి నుండి ఆమె డబ్బా నింపి ఇస్తున్నా అక్కర్లేదంటూనే ఆఫీసుకి పోయేవాడు. ఉత్త చేతుల్తో వచ్చిన ఆదినారాయణ్ణి చూసి కొలీగులు తిరిగి కాంటీను కెళ్ళసాగారు.

మధ్యాహ్నం వేళ టిఫిను బొత్తిగా పడకపోవడం వల్ల అతడి ఆకలి అయిదయేసరికల్లా సీటు నుండి లేవగొట్టడం మొదలెట్టింది. అక్కణ్ణుంచి టంచనుగా అయిదుకే ఆఫీ సొదిలేయసాగాడు. అతడొచ్చేసరికి ఇంటివద్ద ఆమె వేడి వేడి టిఫిను రెడీ చేసి ఉంచేది. ఆకలి చల్లారాకనే బజారు పనులు చూసుకునేవాడు.

అతడి కొలీగుల దండయాత్ర అంతటితో ఆగిపోలేదు.

ఒక రోజు సాయంకాలం ఎప్పటివలెనే అయిదు గంటలకు ఇంటికి బయల్దేరాడు ఆదినారాయణ. అది చూసి అతనితోపాటూ ఆంజనేయులూ, గోవిందరావూ, గుర్నాధంకూడా బయల్దేరారు. అతడు కొన్న కొత్త ఫానుని చూపించమంటూ. అంతా ఇంటి కొచ్చారు. అన్ని కోణాల్లోనూ ఫాన్ను చూసి బాగా ఉందన్నారు. ధరలో వారాయేమీ ఉండదన్నారు. జాగ్రత్తగా వాడుకోమని కొన్ని సూచనలిచ్చారు. ఆ తరవాత నలుగురూ కూచొని కబుర్లలో పడిపోయారు. వాళ్ళా కబుర్లనుండి తేరుకొని బయల్దేరదామనుకునేసరికి పకోడీ వాసనొచ్చి పలకరించింది. వాళ్ళ చూపులు వంటింటి వైపు నిలిచిపోయాయి. నోళ్ళు గేట్లూడిన ఆనకట్టలయ్యాయి. స్నేహితుల మనసును గ్రహించిన ఆదినారాయణ పకోడీ పట్టుకు రమ్మంటూ భార్యకు కేక వేశాడు. కమలకు భర్తపై కోపమూ, వంటిల్లు దాటి వచ్చిన వాసనపై విసుగూ కలిగాయి. అయినా చేసేది లేక చేసిన కొద్దిపాటి పకోడీని నలుగురికీ సర్ది పెట్టేసి కాఫీ కలపడంలో పడిపోయింది. నిమిషంలో ప్లేట్లను ఖాళీచేసి, కాఫీని కరుస్తూ తిరిగి కబుర్లలో పడిపోయారు. తిన్నది అరిగేవరకు తీయని కబుర్లు చెప్పి, ఏడు గంటల తరవాత గుడ్‌నైట్ చెప్పి పోయారు కొలీగులు ముగ్గురూను.

ఆ వేళ మొదలయిన వాళ్ళ రాక ఆ నాటితోనే ఆగిపోలేదు. రోజూ ఆఫీసొదిలే వేళలో ఆ ముగ్గురూ ఆదినారాయణతోనే కలిసి బయల్దేరుతూ సాయింత్రం టిఫిను టైమ్‌కి అతడి ఇంటిపై హవాలయిపోసాగారు. ఆఫీసు రోజుల్లోనే కాకుండా శెలవు రోజుల్లోనూ వచ్చి పోతున్నారు. రోజూ సాయంత్రం సరిగ్గా అయిదున్నర కొచ్చేసి, వంటింటినుండి వచ్చే పాత్రల సవ్వడినీ, వేస్తున్న వాసననూ ఆధారంగా తయారవుతున్న వంటకమేమిటో అంచనా కట్టుక్కూర్చుంటారు. వాళ్ళ రాక రెగ్యులరయిపోయినందుకు, టిఫిను భర్త ఒక్కడికే కాకుండా మరో ముగ్గురికి సరిపడేలా చేయవలసి వచ్చింది కమలకు. ఎప్పుడో ఏదో వారాని కోమారు సరదాగా వస్తే ముగ్గురయినా, ముప్పయిముగ్గురయినా ఫరవాలేదు గాని, ఇలా రోజూ నలుగురికీ టిఫిను చేసి పెట్టడం గుమాస్తా బతుకులో కష్టమే మరి! టిఫిను టైమ్‌లో వారి రాక



ఒక తప్పించుకోలేని తలనొప్పిగా తయారయిందా దంపతులకు. దీనివల్ల ఖర్చు కాంటీను బిల్లులా పెరిగి పోవడమేగాక కమలకు శ్రమా పెరిగింది. అంతేకాకుండా భర్త రోజూ చీకటి పడేవరకు వాళ్ళతో కబుర్లకు కూచొని, తర్వాత బజారు కెళ్ళాలంటే బద్ధకించేస్తున్నాడు. అందువల్ల మర్నాటి వంటకామె ఇబ్బంది పడవల సి వచ్చేది.

కమలను ఈ తలనొప్పి నుండెలా బయట పడాలనే చింత సతాయించసాగింది. సాయంత్రం టిఫిను పద్ధతిని ఎత్తే సిన సమస్య విడిపోను. కాని, మధ్యాహ్నం వేళ మానుకున్నా, సాయంకాలమయినా ఆ కాస్తా నాస్తా చే సి పెట్టకపోతే అతడు మరీ నీర సించి పోతాడేమో నన్న భయం వల్ల ఆ ఆడమనసు వెనకాడింది. కాని, రోజూ ఇలా పార్టీ చేయాలంటే తన తరం కాదనుకుంది కమల.

ఆ ముగ్గుర్నీ వదిలించుకుంటేగాని ఆమెకు మనసు మనసులో ఉండదు. కాని ఎలా? ఉపాయాలు చాలానే ఉన్నాయి. కాని, ఆ పద్ధతి భర్తకు నచ్చకపోతే అదో పేచీ. అతడు వాళ్ళ ముందు చెడ్డయి పోకూడదు. తాము కోరుండి వెళ్ళగొట్టినట్టు వాళ్ళనుకోకూడదు. వాళ్ళంతట వాళ్ళే రావటం మానుకొనేలా చెయ్యాలి. తగిన మార్గం కోసం ఆమె తీవ్రంగానే ఆలోచించసాగింది. తగిన ఉపాయం తట్టేదాకా గత్యంతరం లేని కమల రోజు కో రకం టిఫినుతో వాళ్ళను ఆదరిస్తూనే ఉంది.

ఒక రోజు ఒకలా చేద్దామనిపించిం దామెకు.

ఆ రోజూ రోజూ లాగానే ఆఫీసొదిలాక ఆదినారాయణతోపాటు అతని కొలీగులు ముగ్గురూ వచ్చి పడ్డారు. డ్రాయింగు రూములో కూచొని కబుర్లు చెప్పుకుంటున్నారే గాని, చూపంతా ఎప్పటి మాదిరిగానే వంటింటి వేపు ఉంది. గిన్నెల సవ్వళ్ళూ, పదార్థాల సువాసనలూ, స్టౌ సయ్ సయ్‌లూ, అట్టుపుల్ల టకటకలూ, గరిట గలాటా, కాఫీ కప్పుల గణగణలూ... రోజూ ఎంతో మధురంగా వినవచ్చేది. అవెక్కడికి పోయాయి చెప్మా అంటూ చూస్తున్నారు.

వాళ్ళలా మాటల్లో పడి అరగంట గడిచే సినా వంటింటి నుండి అలికిడి గానీ, ఐటమ్ గానీ రాకపోయేసరికి, 'ఈ వేళ కిక ఇంతే గామోను' అనుకున్నారు. కనీసం కాఫీ చుక్కయినా రాకపోదా అని ఎదురు చూశారు. ఆదినారాయణ వాళ్ళ తొందర్ని గమనించాడు కాని, కమల ఎందువల్ల కామ్‌గా ఉందో బోధ పడలేదు. మొగమాటంతో మెలికలు తిరిగిపోయాడు. ఇంకా ఆలశ్యం చేయడం బాగుండదని భార్యకు కేక వేశాడు.

ఆమె బెడ్రూంనుండి వస్తూ ద్వారం వద్ద ఆగిపోయింది. కర్టెను కదిలి కమల ఉనికిని తెలియజే సింది.

"డొక్కలో ఎలుకలు ఒకటే అల్లరి చేస్తున్నాయి. నీదే ఆలశ్యం,కమూ!" అన్నాడు ఆదినారాయణ.

ఆమె మౌనం వహించింది. క్షణం చూ సి అతడు లోని కెళ్ళాడు.

"ఏమీ చెయ్యలేదా?" భార్యను అడిగినట్లు బయటికి వినిపించింది.

"అదేంటిలా అడుగుతున్నా రిప్పుడు? మర్చిపోయారా ఏం? ఇకనుండి సాయంత్రం మజ్జిగన్నం తింటా నన్నారు గదా!" ఆమె మాటలు అణుకువగా వినిపించాయి.

ముగ్గురికీ మూర్ఛొచ్చినంత పనయింది. ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

ఆమె మళ్ళీ అంది-"కాఫీ కలుపుదామన్నా పొడి నిండుకుందని నిన్ననే చెప్పాను."

ఆదినారాయణకు ఆమెపై విపరీతమయిన కోప మొచ్చింది. హఠాత్తుగా తనను ఆక్వర్డ్ పొజిషనులో పడే సిం దనుకున్నాడు. రెండ్రోజుల కిందట తెచ్చిన కాఫీపొడి అప్పుడే అయిపోవడమేమిటి? తను బుద్ధెరిగి మజ్జిగన్నం ముట్టుకోలేదే! భార్య ఉద్దేశం బాగానే బోధ పడిం దతనికి. కాని, తనకు ముందు చెప్పకుండా ఇలా చెయ్యడం ఏం బాగులేదనుకున్నాడు. కొలీగులే మనుకుంటారో నన్న మొగమాటంతో మెలికలు తిరిగిపోయాడు.

ఆమె నేమీ అనలేక తిరిగి డ్రాయింగు రూమ్ కొచ్చి విచారిస్తూ కూచున్నాడు ఆదినారాయణ. ఆపై ఎవరూ ఏమీ మాట్లాడలేక పోయారు.

కొన్ని క్షణాలు రాజ్యమేలిన నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ కూర్చున్నవాడల్లా అన్నాడు గోవిందరావు: "నా కీ వేళ కాస్త పనుందోయ్. మామూ డో పిల్లకు మందులు కొనాలి. ఇక నే వెళ్ళా లనుకుంటున్నాను."

గోవిందరావుతో పాటూ గుర్నాథమూ లేచి నిలబడ్డాడు. "నేనూ కూచో లేనో యింకా. మాటల్లో పడి మర్చే పోయాను. పిల్లవాడి పాల డబ్బా కోసం ప్రయత్నించాలి" అంటూ.

వాళ్ళిద్దర్నీ చూ సి మరెందుకని ఆంజనేయులూ బయల్దేరుతూ అన్నాడు- "అవునట ఆఫీసుకి బయల్దేరి నప్పుడే ఇంటి వద్ద మల్లెపూలు తెమ్మని చెప్పారు. బజారు కెళ్ళక తప్పదు."

ఆతిధ్య మివ్వనంత మాత్రాన అర్జంటు పనులున్నాయంటూ లేచి వెళిపోతున్న మిత్రులను చూ సి లోలోపల నవ్వుకున్నాడు ఆదినారాయణ. రోజూ గంటల తరబడి కబుర్లు చెప్పే కొలీగులకు హఠాత్తుగానూ, అదీ అందరరికీ ఒకేసారిగానూ అర్జంటు పనులు ఎందువల్ల వడ్డాయో స్పష్టమయిం దతనికి. దీంతో భార్యపై కలిగిన కోపమూ చప్పున చల్లారి పోయింది.

మనసులోని బాధను కప్పుకంటూ, లేచి నిలబడ్డ స్నేహితులతో అన్నాడు ఆదినారాయణ: "సరే అయితే... రేపు ఆఫీసులో కలుద్దాం।"

వాళ్ళను సాగనంపుతూ సందు మలుపు వరకు వెళ్ళి తిరిగి వచ్చిన ఆదినారాయణకు, ప్లేటు నిండా అరటి బజ్జీలతో భర్త కళ్ళ లోకి బితుగ్గా చూస్తూ నడవ గదిలోనే ఎదురయింది కమల.

అతడు ప్లేటు నందుకుంటూ చిరునవ్వు నవ్వాడు. ★